www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

www.freegurukul.org

# అపూర్వ ప్రజాస్వామ్యవాది

సందర్భం



బర్మని మల్లిఖార్జున్

శతమానాల నుంచి సమసమాజం శోషణకు గురై సామాజిక వ్యవస్థ బూజుపట్టి అస్పృశ్యత, జాతి వర్ణ, వర్గ విభేదాలు యజ్ఞయాగాలు, హోమాలు, నరబలి, స్త్రీ శిశు హత్యలు బాల్య వివాహాలు, సతీసహగమనం మొదలగు మూఢాచారాలు తాండవిస్తున్న కాలమంది. ఈ తరుణంలో బసవణ్ణ అనే క్రాంతి పురుషుడు కీ.శ.1134లో ఆనందనామ సంవత్సర వైశాఖ మాస అక్షయతృతీయ రోజున ఇప్పటి కర్ణాటక రాష్ట్ర బీజాపూర్ జిల్లా బాగేవాడి అనే గ్రామంలో మదాంబికా–మాదిరాజు దంపతులకు జన్మించాడు.

లింగాయత ధర్మ సృష్టికర్త మహాత్మా బసవేశ్వరుడు విశ్వగురువు, మహామానవతా వాది, సంఘసంస్కర్త, కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థను రూపుమాపడానికి క్రీ.శ.12వ శతాబ్దంలోనే పూనుకున్న సాంఘిక విప్లవకారుడు, స్త్రీ పురుష అసమానతలను తొలిగించడానికి కృషిచేసిన అభ్యుదయవాది. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రగతిశీలి. మొట్టమొదటి కులాంతర వివాహం చేసిన గొప్ప సంఘసంస్కర్త తనకాలపు సమాజ జీవితంలో వెలుగులు నింపిన చింతకుడు బసవన్న.. జగమెరిగిన శ్రేష్ఠ దార్శనికుడు, ముక్త సమాజపు వైతాళికుడు. సామాజిక వ్యవస్థలో సమానత్వం ఉండాలని ఆకాంక్షించారు. మనుషులు శాంతి సామరస్యాలతో సహజీవనం జరుపాలని బోధించారు. సుఖసంతోషాలకు కష్టపడి పనిచేయాలని, నిరాడంబర జీవితం గడుపాలని ఉపదేశించారు. వ్యక్తుల జీవితాలను, సమాజ గమనాన్ని ప్రభావితం చేసేవిధంగా బసవన్న సొంత ఒరవడిలో కొత్తధర్మాన్ని సృష్టించారు.

అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను బసవన్న తీవ్రంగా ఖండిచారు. ఆయనకు పూర్వం స్త్రీలకు పంచములకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులుండేవి కావు. బసవన్న రాకతో అందరు అన్ని బంధాల నుంచి విముక్తి పొందారు. వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచి ఒక నూతన సమసమాజాన్ని స్థాపించారు. సమాజ నిర్మాణంలో ఆయన దార్శనికత నాయకత్వం ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. బసవన్న పూర్వపుయుగంలో పంచములకు, వెనుకబడిన కులాలవారికి దేవాలయంలోకి ప్రవేశం లేదు. ఆ కాలంలో బసవేశ్వరుడు సమసమాజ స్థాపన కోసం దేవుడినే భక్తుడి వద్దకు తీసుకురావడానికి ఇష్ట లింగమును కనిపెట్టాడు. పరమశివునికి ప్రతిరూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతిని కులవ్యవస్థను అంతమొందించారు. ఆచార పారాయణులు పంచముల ను గుడికి రానివ్వనప్పుడు ఆ గుడిలోని లింగాన్ని తెచ్చి వారి ఒడిలోన ఉంచిన మహనీయుడు బసవన్న. నేడు మనం ఆచరించే యోగాను నాడే ఆయన తన ఇష్టలింగ పూజలో జతచేశారు. మాంసాహారాన్ని త్యజించి శాఖహారాన్ని స్వీకరించడం ఇష్ట లింగాదరణ, ఇష్ట లింగ పూజ బసవన్న సూచించిన భక్తి మార్గం. నర, పశు బలి, యజ్ఞయాగాలు అర్థం లేని పూజలను నిరోధించి అనంతమైన, అతీతమైన సహజ శివయోగాన్ని బసవన్న ప్రసరింపజేసినారు.

జ్ఞానమే గురువు. దేహమే దేవాలయం, స్త్రీ పురుష భేదం లేదు, శ్రమకు మించిన సౌందర్యం లేదు, పనిని మించిన దైవం లేదు. కష్టాన్ని మించిన భక్తిలేదు, భక్తి కన్న సత్ప్రవర్తనే ముఖ్యమని చేసే పనిలో దేవుడిని చూసే మార్గాన్ని చూపించి 'కాయకమే కైలాసం' అనే కొత్త ఒరవడికి నాంది పలికారు బసవేశ్వరులు. లింగాయత ధర్మం ఓ విప్లవాత్మకమైన మత రూపం. అప్పటిదాకా ఉన్న ఛాందసవాదాన్ని తుడిచిపెట్టేందుకు శివుడి మూడో కంటి నిప్పురవ్వలా దూసుకొచ్చిన ఓ శతాఘ్ని బసవన్న, మనుషులంతా ఒక్కటే, కులాలు ఉపకులాలు లేవు. సమాజం లో ధర్మం పేరిట దురాచారాలను చూసి ఇవన్నీ స్వార్థపరుల సృష్టి అంటూ అప్పటి సమాజంలో సమరభేరి మోగించిన సాంఘిక విప్లవకారుడు బసవన్న. సర్వ సమానత్వమే శాంతికి మూలం అని మానవ కళ్యాణం కోసం ప్రతిభా సంపన్నమైన స్వతంత్ర సమాలోచనలు చేసిన మొదటి వ్యక్తి బసవన్న. పుట్టుకతో అందరు సమానం. జాతి వర్గ భేదం లేకుండా ఆసక్తి కలవారందరు దీక్షా సంస్కారం పొందవచ్చని చెప్పేదే లింగాయత ధర్మం.



పాల్కుర్కి సోమనాథుడు తన ఆరాధ్య దైవమైన బసవేశ్వరునిపై బసవపురాణం రాశాడు. ఆయన గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటుచేసింది. తెలంగాణ వాసి డాక్టర్ నీరజ్ పాటిల్ ఎంతో కృషిచేసి మన ప్రధాని మోదీ చేతులమీదుగా లండన్‌లో బసవేశ్వరుని విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. భారత ప్రభుత్వం 2006లో రూ.5 నాణేన్ని విడుదల చేసి ఆ మహాత్ముని స్మరించుకున్నది.

నేటి మన పార్లమెంటరీ వ్యవస్థతో సమానమైన అనుభవ మంటపాన్ని బసవేశ్వరులు నాడే స్థాపించి అందులో జాతి, కుల, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అందరికీ సమానావకాశం కల్పించారు. నేడు మనం స్త్రీలకు ఇచ్చే రిజర్వేషన్ అవకాశాన్ని నాడే తన అనుభవ మండపంలో కల్పించారు.

బుద్ధ భగవానుడు, జైన మహవీరుని తర్వాత కుల, మత విభేదాలు పురోహిత పద్ధతి, యజ్ఞ యాగాదులను మనస్ఫూర్తిగా నిరసించిన బసవేశ్వరులు విశ్వబంధుత్వ వాది, బసవేవ్వరుని వచనాలు, ఉపదేశాలు ఇప్పటివరకు నేటి సమాజం చెంతకు చేరకపోవడం దురదృష్టకరం. ఏనాడైతే బసవేశ్వరుడు చేసిన పనులు, సందేశాలు నేటి సమాజం గ్రహిస్తుందో నాడు బసవేశ్వరునికి బుద్ధ భగవానుడి, జైన మహవీరుని వరుసలో సముచిత స్థానం ఇవ్వవలసి ఉంటుం ది. బసవన్న పరిపూర్ణ బుద్ధుడు, బుద్ధుడికి బసవేశ్వరుడికి మధ్య పోలికలున్నాయి. అలోచనా విధానంలోను, ధర్మ నిర్వహణలోను వీరిరువురు సర్వసమానంగా ఉంటారు. బుద్ధ డు వర్గాలకు వ్యతిరేకంగా పోరాడారు, ఆ కాలంలోనే స్త్రీలకు సమానమైన ధార్మిక హక్కులు కల్పించారు.

నాడు బసవేశ్వరుడు అంకుర్పారణ చేసిన లింగాయత ధర్మానికి నేడు కర్ణాటక ప్రభుత్వం మైనార్టీ హోదా ఇచ్చి ప్రత్యేక మతంగా పరిగణించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. బసవన్న తన ఉపదేశాలను ప్రజలకు అందుబాటులో ఉండేరీతిగా వచనాలు రాసిన గొప్ప తత్త్వవేత్త, ఆ వచనాల్లోని సూక్ష్మమైన తత్త్వం సులువుగా బోధపడుతుంది. సాహిత్యపరంగా కూడా బసవేశ్వరుని వచనాలకు చక్కని గౌరవం లభించింది. బసవన్న 64 లక్షల వచనాలు రాసినట్టు ప్రతీతి. అయినా నేడు కొన్ని వేలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. బసవన్న వచనాలు నేటి మానవాళికి మార్గదర్శకం. విశాల హృదయం, మానవతావాదానికి మకుటమైన వచనాలను అన్ని భాషల్లో అనువదించాలి. ఆయన చరిత్రను నేటి తరానికి తెలియజేస్తే సమాజానికి ఒక మంచి సందేశం ఇచ్చినవారమవుతాం.

పాల్కుర్కి సోమనాథుడు తన ఆరాధ్య దైవమైన బసవేశ్వరునిపై బసవపురాణం రాశాడు. ఆయన గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటుచేసింది. తెలంగాణ వాసి డాక్టర్ నీరజ్ పాటిల్ ఎంతో కృషిచేసి ప్రధాని మోదీ చేతులమీదుగా లండన్‌లో బసవేశ్వరుని విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. భారత ప్రభుత్వం 2006లో రూ.5 నాణేన్ని విడుదల చేసి ఆ మహాత్ముని స్మరించుకున్నది. తెలంగాణ ప్రభుత్వం బసవేశ్వరుడి జయంతిని ఏటా అధికారికంగా నిర్వహిస్తున్నది. ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటుచేసింది.

**(నేడు మహాత్మా బసవేశ్వరుడి జయంతి)**